క్లుప్తంగా

పుస్తకాల పేరుతో వ్యాపారం చేస్తున్నా పట్టించుకోరా..?

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కాట్ బుకింగ్ పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యా విద్యాసంస్థలను విద్యాశాఖాధికారులు పట్టించుకోకపోవడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి అన్నారు. గురువారం నగరంలోని చైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పుస్తకాల అమ్మకాలను అడ్డుకొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు పేరుని అడ్డుపెట్టుకొని విద్యార్థులను, విద్యార్థుల తల్లి దండ్రుల పైన భారం మోపి వేల రూపాయలు దోచుకుంటున్నారన్నారు. ఒక జిల్లాలోనే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో పుస్తకాల పేరుతోనే కోట్ల రూపాయలు దోపిడీ చేస్తూ, అధికంగా ఫీజులు తీసుకుంటున్నారన్నారు. అయినప్పటికీ విద్యాశాఖ అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు అభినయ్, నగర కార్యదర్శి మోహన్, నగర నాయకులు అఖిలేష్, ధన తదితరులు పాల్గొన్నారు.

మొదటి వారంలోనే జీతాలను చెల్లించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నెల ప్రారంభంలో ఇవ్వాల్సిన జీతాలు సకాలంలో చెల్లించకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వారికి రావలసిన జీతాలను నెల మొదటి వారంలోనే చెల్లించాలని, రాయలసీమ ట్రేడ్ యూనియన్ నగర కార్యదర్శి మడగలం ప్రసాద్ కోరారు. గురువారం నగరంలోని ఆర్సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు సకాలంలో వేతనాలు అందక ఇంటి బాడుగలు, కరెంటు బిల్లులు, పిల్లల స్కూలు, ఆటోల ఫీజులు, డ్వాక్రాలు చెల్లింపులు, వ్యక్తిగత ఈఎంఐలు తదితర చెల్లింపులలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. వీటి వలన అవమానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని వారికి రావలసిన డబ్బులను నెల మొదటి వారంలోనే చెల్లిస్తే! వారు చెల్లించవలసిన వారికి సకాలంలో చెల్లించే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. గతంలో రిమ్స్ లో పని చేస్తున్న సిబ్బందికి బాడుగ ఇళ్లను కూడా బాడుగలకు ఇచ్చేవారు కాదని, ఇప్పుడు మళ్లీ అలాంటి స్థితి వచ్చిందని, గుత్తేదారులు దీనిని గమనించి కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, మునెయ్య పాల్గొన్నారు.

బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలి



ఆర్జేకి వినతి పత్రం ఇస్తున్న ఏపీ పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖల్లో నిర్వహించే బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని ఏపీ పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జంబారపు అహరోన్ తెలిపారు. ఆ మేరకు గురువారం స్థానిక వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్యకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బదిలీలకు సంబంధించి ఇంకా కొన్ని కేడర్ ల లాంగ్ స్టాండింగ్ సీనియారిటీ లిస్ట్ రావాల్సి ఉందని, ఆ జాబితాను వెంటనే ప్రకటించాలని తెలిపారు. బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎర్రపు రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కార్యదర్శి మహబూబ్ బాషా, కోశాధికారి జనార్దన్, జోనల్ జాయింట్ సెక్రటరీ రాఘవేంద్ర రాజు, ఉపాధ్యక్షులు సుధాకర్, శ్రీనివాసులు నాయక్, జయరామయ్య, జయరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

బలిజపల్లె గంగమ్మకు పూజలు



ఆకట్టుకున్న చాందినీ బండి

రాజంపేట టౌన్ : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన బలిజపల్లె గంగమ్మకు గురువారం భక్తులు పెద్దఎత్తున పూజలు చేశారు. వేసవి సెలవులు ముగుస్తుండటంతో విద్యార్థులు కళాశాలల్లో చేరడం, చదువుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లనుండటంతో గంగమ్మకు మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈ సందర్భంగా అనేక మంది అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలు సమర్పించారు. కోళ్లు, మేకపోతులు, పొట్టేళ్లను బలులుగా అర్పించారు. సల్లంగా చూడమ్మా గంగమ్మా అంటూ మొక్కుకున్నారు. అనుకున్న పనులు సవ్యంగా జరిగితే వచ్చే ఏడాది ఇష్టమైన నైవేద్యాలు సమర్పిస్తామని వరపడ్డారు. ఇదిలావుంటే పలువురు పందారపు బండ్లు, చాందిని బండ్లు సైతం కట్టారు. ఈ సందర్భంగా భక్తులు తప్పెట్ల దరువుకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ముందుకు సాగడంతో పట్టణంలో కోలాహల వాతావరణం నెలకొంది. అలాగే బలిజపల్లె గ్రామంలో చిన్నపాటి జాతర సందడి కనిపించింది.

ప్లాస్టిక్ వాడకం భావితరాలకు ముప్పు

– గ్రీన్ ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : పర్యావరణానికి తీవ్ర ముప్పు కలిగిస్తున్న ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రజలు మానుకోవాలని మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం నగరంలో గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి సంధ్య సర్కిల్ మీదుగా కోటిరెడ్డిసర్కిల్ వరకు ర్యాలీ జరిగింది. సర్కిల్‌లో మానవ హారం ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని మానేందుకు అందరూ ప్రతిజ్ఞ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల సంభవించే దుష్పరిణామాల గురించి ఆయన వివరించారు. కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీరు సుధా కురుబ మాట్లాడుతూ ఒకేసారి ఉపయోగించే ప్లాస్టిక్ బాటిళ్లు, ప్లాస్టిక్ సంచులతోపాటు ప్రకృతికి హాని చేసే ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకాన్ని ప్రజలు పూర్తిగా మానుకోవాలన్నారు. ప్లాస్టిక్ వస్తువులకు బదులు స్టీల్ గ్లాసులు, గాజు సీసాలు, గుడ్డ సంచులు, ఇతర పర్యావరణ అనుకూల ఉత్పత్తులను వినియోగించాలన్నారు. భవిష్యత్ తరాలకోసం పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జెడ్పీ సీఈఓ ఓబులమ్మ అన్నారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం చాన్‌బాష, ఏపీ ఐఐసీ జోనల్ మేనేజర్ కె.శ్రీనివాసులురెడ్డి, సాక్షి దినపత్రిక బ్రాంచ్ మేనేజర్ హరినాథరెడ్డి, సిబ్బంది, ఫాతిమా మెడికల్ కళాశాల విద్యార్థులు, జువారి సిమెంట్స్ ఉద్యోగులు, ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

కడప కల్చరల్ : ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ వాడకం బాగా పెరిగిందని, శాస్త్రీయ కోణంతో అవగాహన చేసుకుని పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడకపోతే భావితరాలకు ముప్పు తప్పదని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్ అన్నారు. గురువారం ఆయన స్థానిక ఆర్కే నగర్ ఉర్దూ పాఠశాలలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ పేరిట నినాదాలకే పరిమితం కాకూడదని, శాస్త్రీయ దృష్టితో ఆచరణకు దిగాలని సూచించారు. మొక్కలు నాటడం ఒక చిన్న పాటి చర్య మాత్రమే కాదని, భవిష్యత్తు తరాల కోసం మనం తీసుకునే బాధ్యతాయుతమైన నిర్ణయమని ఆయన పేర్కొన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్షులు సమీర్‌బాష మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఒక మొక్క నాటాలని సంకల్పం తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిదాం ...పర్యావరణాన్ని కాపాడుదాం పేరిట నినాదాలు చేశారు. స్కూలు కమిటీ అధ్యక్షులు మహబూబ్ బాష, శేఖర్, వెంకటేశ్వర్లు, సరస్వతి, సుబ్బమ్మ, రామేశ్వరమ్మ, డాక్టర్ చంద్రప్రసాద్, ఉపాధ్యాయులు అబ్దుల్ గఫూర్, శేషయ్య, లక్ష్మీదేవి, వెంకట్రామరాజు, కుమారస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోటిరెడ్డిసర్కిల్‌లో మానవహారంగా ఏర్పడిన అధికారులు, విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

కడప ఎడ్యుకేషన్: రేపటి తరానికి అందమైన ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతగా భావించాలని ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డు చిత్తూరు, అన్నమయ్య, వైయస్సార్ కడప జిల్లాల సమన్వయకర్త ఖాదర్ వల్లి అన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయ బొటానికల్ గార్డెన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఏ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉదయం । ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గార్డెన్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఖాదరవల్లి మాట్లాడుతూ భూమి, నీరు ,గాలి ఉండాలంటే ప్రజల అలవాట్లలో, ఆలోచనల్లో మార్పులు రావాలన్నారు. ఆచార్య మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ బయోడైవర్సిటీ బోర్డ్ ఆధ్వర్యంలో ఎర్రచందన మొక్కల పెంపకం పర్యవేక్షణ జరుగుతోందన్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఇకపై నిత్య జీవితంలో ప్లాస్టిక్ వస్తువులు వినియోగించబోమని ప్రతిజ్ఞ చేశారు. విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగ డీన్ ప్రొఫెసర్ వై సుబ్బరాయుడు, మాజీ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రారెడ్డి, జర్నలిజం అధ్యాపకులు డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు, బోటనీ అధ్యాపకులు డాక్టర్ రాజగోపాల్ రెడ్డి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సిహెచ్ వెంకటేష్, డాక్టర్ బాబు స్కాలర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

కడప కోటిరెడ్డి సర్కిల్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతుగా తోడ్పాటు అందించి కాలుష్య రహిత వాతావరణం నెలకొనేలా చర్యలు చేపట్టాలని డాక్టర్ ప్రశాంత్ వర్దన్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ప్రసన్న లత పిలుపునిచ్చారు. కడప నగర పరిధిలోని నాగరాజు పేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ పరిధిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ వైద్యులు హరిప్రసాద్, వర్షితసింహ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని డీఓసీ రమణయ్య, డీటీసీ శివప్రసాద్‌లు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ।వనం-మనం।కార్యక్రమంలో భాగంగా కడప హజ్మాడి స్కౌట్ హాల్ ఆవరణంలో జిల్లా స్కౌట్ కమిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటి అనంతరం పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని అందరూ పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని వక్తలు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ గునిశెట్టి శ్రీ నివాసులు , అసిస్టెంట్ సెక్రటరీ ఖాదర్ బాష, యల్వోసీ లీడర్ అహమ్మద్, స్కౌట్ మాస్టర్ శివప్రసాద్, బాలసుందరం తదితరులు పాల్గొన్నారు.

ధరిత్రిని కాపాడుకోవడం మన భాధ్యత

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని కడప నగర శివార్లలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు అనేక కార్యక్రమాలను నిర్వహించారు. నగర శివారులో ఉన్న నగరవనంలో మొక్కలు నాటారు. అలాగే పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు . ఆ తర్వాత పాఠశాల భోజనశాలలో కొత్త ఏసీ ప్లాంట్(శీతలీకరణ యంత్రాలను) ను ఏర్పాటు చేసి ప్రారంభించారు . ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు అమిత్ సింగ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చిన్నారులు పర్యావరణం పట్ల అవగాహనతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉప ప్రధానాచార్యులు శ్రీనివాసమూర్తి , రిజిస్ట్రార్ రహమతుల్లా , పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



పర్యావరణ దినోత్సవంపై అవగాహన కల్పిస్తున్న జేవీవీ నాయకులు



పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, వైద్యసిబ్బంది



వైవీయూ ఆవరణంలో మొక్కనాటి నీరు పోస్తున్న ఖాదర్ వల్లి



స్కౌట్ హాల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న డీఓసీ, డీటీసీ తదితరులు



పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటుతున్న హైదరాబాదు పబ్లిక్ స్కూల్ ప్రధానాచార్యులు

ఆధునిక సాగు పద్ధతులతో దిగుబడులు

సిద్దవటం : రైతులు ఆధునిక పద్ధతులతో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి తెలిపారు. సిద్దవటం మండలంలోని మాచుపల్లె, టక్కోలు గ్రామాల్లో ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలు, సబ్సిడీల గురించి వివరించారు. అలాగే వరి పంటలో పోషక యాజమాన్యం, చీడ, పీడలు, తెగుళ్ల యాజమాన్యంపై తెలియజేశారన్నారు. కె.వి.కె. శాస్త్రవేత్త డాక్టర్ మహేష్‌బాబు మాట్లాడుతూ భారత ప్రభుత్వం రైతుల ఆదాయం పెంచాలనే ఉద్దేశంతో ఖరీఫ్ సీజన్‌లో వారి సమస్యలను తెలుసుకొని ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవడానికి ఈ కార్యక్రమం దేశం మొత్తం 15 రోజుల పాటు నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. రైతుల కోసం కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న విస్తరణ సేవలపై అవగాహన కల్పించారు. ఉద్యాన శాస్త్రవేత్త మానస మాట్లాడుతూ మామిడి, కూరగాయ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చీడ, పీడ, యాజమాన్య పద్ధతులను సూచించారు. ఉద్యాన కళాశాల సహాయ ఆచార్యులు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అరటిలో గెలల యాజమాన్యం, పోషకాలు, చీడీ పీడల యాజమాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో గిరీష్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ ఉద్యాన, వ్యవసాయ సహాయకులు, ఆయిల్ ఫామ్ కంపెనీ ప్రతినిధులు, టక్కోలు, మాచుపల్లె గ్రామాల రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

బక్రీద్ పండగ సంతోషంగా జరుపుకోవాలి

కమలాపురం : ఈ నెల 7వ తేదీన జరగనున్న బక్రీద్ పండుగను హిందు-ముస్లిం సోదరులు కలసి మెలసి ఐకమత్యంగా, సంతోషంగా జరుపుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ మార్పూరి మేరి తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బక్రీద్ పండుగను హిందు ముస్లింలు కలసి ఐకమత్యంగా జరుపుకోవాలన్నారు. ముఖ్యంగా గోవధ నిషేధం అని, ఇది పార్లమెంటులోనే చట్టం చేశారని గుర్తు చేశారు. గోవధ చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ముస్లిం మత పెద్దలకు ఆమె సూచించారు. అలాగే ఎక్కడైనా ఏ సంఘటన జరిగిన ముందుగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

బక్రీద్ పండుగ రోజున నమాజ్ చదివే ఈద్గాల వద్ద తగిన పారిశుద్ధ్య ప్రమాణాలు పాటించాలని, నీటి సౌకర్యం కల్పించాలని ఆమె మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ఎస్ఐ విద్యాసాగర్, కమిషనర్ జగన్నాథ్ మాట్లాడుతూ గోవధ పూర్తిగా నిషేధం అన్నారు. ఆవులు, దూడలు, ఒంటెల మాంసాలు విక్రయించుట, సంహరించుట, తరలించుట చట్ట వ్యతిరేకం అన్నారు. అలాంటి చర్యలకు పాల్పిడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అన్ని మతాల మతపెద్దలు పాల్గొన్నారు.

పాఠశాల ఆయాలకు వేతన బకాయిలు చెల్లించాలి

– ఏఐటీయూసీ ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలు, నైట్‌వాచ్‌మెన్లుగా పనిచేస్తున్న కార్మికులకు మూడు నెలలుగా ఇవ్వాల్సిన వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా జరిగింది. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, ప్రభుత్వ పాఠశాలల ఆయాల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చాంద్‌బాష, గౌసియా, నాగలక్ష్మి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే కంటింజెంట్ కార్మికులకు కనీస వేతనాలు రూ. 10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలన్నారు. ఆరు వేల రూపాయల చాలీచాలని వేతనాలతో ఆయాల కుటుంబాలు ఎలా బతకాలని ప్రశ్నించారు. పాఠశాలలో కసువు చిమ్మడం, టాయిలెట్లు శుభ్రం చేయడం వంటి పారిశుద్ధ్య పనులు చేస్తున్న తమకు ఇచ్చే ఆరు వేల రూపాయల వేతనం కూడా మూడు నెలలుగా నిలిపి వేస్తే తాము ఎలా బతకాలని కడప నాగరాజుపేట గుండాచారి బడిలో పనిచేస్తున్న ఆయా టి.భారతి ఆవేదన వ్యక్తం చేశారు. ఏదో మేలు చేస్తారని చంద్రబాబు ప్రభుత్వాన్ని గెలిపిస్తే కనీసం తమకు ఇచ్చే అరకొర వేతనాలు కూడా ఇవ్వకపోవడం అన్యాయమని వేంపల్లె జెడ్పీ ఉర్దూ హైస్కూలులో పనిచేసే ఆయా గౌసియా అన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మద్దిలేటి, లింగన్న, సుబ్బరాయుడు, వెంకటేశ్వరి, డీబీ మోహన్, వరలక్ష్మి, నాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు వినతి పత్రం సమర్పించారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, ప్రభుత్వ పాఠశాలల ఆయాలు

ఇంటి కూల్చివేత నిందితులపై పోలీసుల ఉదాసీనత

– ధర్నాలో అఖిలపక్ష నాయకుల ఆరోపణ

కడప సెవెన్‌రోడ్స్ : కడప శివానందపురం ఎస్సీ కాలనీలో వృద్ధురాలు భూమన పిచ్చమ్మ ఇంటిని దౌర్జన్యంగా నేలమట్టం చేసిన వారి పట్ల పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని గురువారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో అఖిలపక్ష నాయకులు ఆరోపించారు. సంఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితుడు బాల గురవయ్య నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఇంటిని కాజేయాలని ప్రయత్నించారన్నారు. పిచ్చమ్మ ఇంటిని నేలమట్టం చేయడంతోపాటు అందులో ఉన్న సామాన్లను ఎత్తుకెళ్లారని ఆరోపించారు. పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా బాల గురవయ్య వద్ద అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయని, ఆ స్థలం ఆయనదేనని సీఐ, ఎస్ఐలు బాధితురాలైన పిచ్చమ్మను బెదిరించి పంపివేయడం దారుణమన్నారు. కడప తహసీల్దార్ విచారణ నిర్వహించి ఆ స్థలం పిచ్చమ్మదేనంటూ నిర్ధారించారు. బాల గురవయ్య నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తన కుమారుడు బాల కుమార్‌కు అక్రమంగా గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటిని కూల్చివేశారంటూ తహసీల్దార్ నివేదిక ఇచ్చారని పేర్కొన్నారు. పోలీసులు నిందితుడు బాల గురవయ్యపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎం.వెంకట శివ, కె.మునెయ్య, మద్దిలేటి, బీసీ మహాసభ నాయకుడు అవ్వారు మల్లికార్జున, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు ప్రసాద్, వక్ఫ్‌బోర్డు జేఏసీ నాయకులు బాబు భాయ్, లోక్‌సత్తా నాయకుడు దేవర శ్రీకృష్ణ, సీపీఎం(ఎల్) న్యూ డెమోక్రసి నాయకులు డబ్ల్యు రాము, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక నాయకుడు సీఆర్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అఖిలపక్షం నాయకులు

నగరంలో బక్రీద్ సందడి





కడప నగరంలో ఇప్పటికే బక్రీద్ పండుగ సందడి నెలకొంది. నగరంలోని బిల్టప్ వద్దగల ఈద్గా ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమైంది. ఎండ వేడిమి కారణంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈద్గా మొత్తం చలువ పందిళ్లు వేశారు. అలాగే నగరంలోని వివిధ మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. అలాగే ముస్లింలు అత్యంత పవిత్రంగా భావిస్తూ ఆచరించే ఖుర్బానీ కోసం పొట్టేళ్ల విక్రయాలు ఊపందుకున్నాయి. కడప నగరంలోని మాసాపేట సర్కిల్, కొత్తమార్కెట్, నకాష్, బిల్టప్, ఐటీఐ సర్కిల్ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పొట్టేళ్లను తీసుకొచ్చి విక్రయాలు నిర్వహించారు. శనివారం బక్రీద్ పండుగైనప్పటికీ గురువారం నాటి నుంచే కడప నగరంలో పండుగ సందడి నెలకొంది.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

వాహనాల తనిఖీ



ద్విచక్ర వాహనాలకు శబ్దం కలిగించే సైలెన్సర్‌లను తీసివేయిస్తున్న ఎస్ఐ

కడప అర్బన్: కడప ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ యు.వై జయరాములు వాహనాల తనిఖీపై గురువారం స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. ద్విచక్ర వాహనాలకు కాలుష్య ప్రమాణాల నిబంధనలు ఉల్లంఘించి బుల్లెట్ వాహనాల సైలెన్సర్ లు మార్చి నడుపుతున్న వారికి జరిమానా విధించారు. బైక్‌లకు వున్న శబ్దం కలిగించే సైలెన్సర్ లను ఎస్ఐ తీయించేశారు. మరోసారి శబ్ద కాలుష్యం చేసే ఇతర సైలెన్సర్ లు వాడితే బైక్ సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే మైనర్ డ్రైవింగ్ చేస్తున్న వారికి వారి పెద్దల సమక్షంలో లో కౌన్సిలింగ్ నిర్వహించి జరిమానా విధించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

పెండ్లిమర్రి : రైతులు పంటల సాగు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా హార్టికల్చర్ అధికారి సుభాషిణి, ప్రకృతి వ్యవసాయ డీపీ ప్రవీణ్ కుమార్‌లు తెలిపారు. గురువారం మండలంలోని చెన్నంరాజుపల్లెలో రైతు గంగిరెడ్డి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలను పరిశీలించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహించాలన్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి పద్ధతిలో ఎరువులు, ఘన, ద్రవ జీవామృతాన్ని తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీపీఎం వసంతకుమారి, థీమాటిక్ లీడ్ సురేష్ బాబు, రైతులు పాల్గొన్నారు.

10 నుండి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు కల్చరల్ : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 10 నుండి ఉద్యోగ పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత తెలిపారు. స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో గురువారం ఉచిత శిక్షణకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ హైకోర్టు, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఆర్ఆర్‌బీ గ్రూప్‌డీ, ఎస్‌టీసీ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన టీచింగ్ ఫ్యాకల్టీతో రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. కోచింగ్‌లో చేరదలచిన వారు 97053 33305 నంబర్‌కు ఫోన్ చేసి రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేవీవీ ఉపాధ్యక్షుడు వేంపల్లి రాజశేఖర్, అనంతకృష్ణ, అంజిరెడ్డి, గాయత్రి, హరికేశవ్, భువన్, హైమావతి పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ఊరేగింపు



సిద్దవటం : మండల కేంద్రం పరిధి దిగువపేటలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా గురువారం సీతా, రామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా ఉదయం ప్రభాతసేవ, ప్రధాన కలశ షోడశోపచార పూజలు, యంత్రములకు, మూల విరాట్‌లకు పూజలు అనంతరం మూల విరాట్‌లను ట్రాక్టర్ ఉంచి సిద్దవటం దిగువపేట గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి వారికి కాయా, కర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ముగిసిన వేసవి శిబిరాలు

చింతకొమ్మదిన్నె : మండల శాఖ గ్రంథాలయంలో ఏప్రిల్ 28వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు జరిగిన వేసవి విజ్ఞాన శిబిరాలు ముగిశాయి. ఈ వేసవి విజ్ఞాన శిబిరాలలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు ఆటల పోటీల కార్యక్రమాలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు స్థానిక సర్పంచ్ మహేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ స్కూల్ కమిటీ చైర్మన్ ఖైరునిసా, పీరు ప్రసాద్‌లు పాల్గొని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఇబ్రహీం, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతియుతంగా జరుపుకోవాలి

– డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు క్రైం : బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు శాంతి సామరస్యాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ప్రొద్దుటూరు డీఎస్పీ భావన తెలిపారు. గురువారం సాయంత్రం డీఎస్పీ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పండుగ సందర్భంగా వివాదాలకు తావు తీసే ఎలాంటి చర్యలకు పాల్పడకూడదని, గోవులు, లేగ దూడల వధకు పాల్పడకూడదని సూచించారు. మాంస వ్యర్థాలను రోడ్లపై, వీధుల్లో వేయకుండా ఊరికి దూరంగా పారవేయాలని, పారిశుద్ధ్యాన్ని పాటించాలని తెలిపారు. ఎలాంటి రెచ్చగొట్టే ప్రకటనలు, ప్రసంగాలు చేయరాదని, సోషల్ మీడియాలో ఎలాంటి అభ్యంతరకర పోస్టులు పెట్టరాదని పేర్కొన్నారు. మత సామరస్యానికి భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆవుల అక్రమ రవాణా నిరోధించుటకు చెక్ పోస్టులు, శాంతి భద్రతలు పర్యవేక్షణకు ప్రొద్దుటూరు ప్రాంతంలో పికెట్లు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సూచనలను పాటించి శాంతి భద్రతల నిర్వహణలో సహకరిస్తూ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు.